వెటర్నరీ అధికారులతో జెడ్సీ సమీక్ష సమావేశం



సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో వెటర్నరీ విభాగం అధికారులతో జెడ్సీ రవికిరణ్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ పరిధిలో జరుగుతున్న కుక్కల సంతాన నిరోధక శస్త్రచికిత్సలు, రేబీస్ వ్యాధి నిరోధక టీకాలపై చర్చించారు. వీలైనంత తొందరగా ఈ కార్యక్రమాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవి కాలం దృష్ట్యా దప్పికతో కుక్కలలో పెరిగే చికాకులతో మనుషులపై దాడులకు పాల్పడుతాయని, అందువల్ల వాటి దప్పిక తీర్చడానికి నిర్మానుష్య ప్రాంతాలలో పెద్ద ఎత్తున నీటి తొట్లను ఏర్పాటు చేయాలన్నారు. చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ అబ్దుల్ వకీల్, వివిధ జోన్ల డిప్యూటీ డైరెక్టర్లు విల్సన్, సుకునందన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, రణజిత్, అసిస్టెంట్ డైరెక్టర్ సద్గుణ దేవి పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న తనికెళ్ల భరణి

రాంగోపాల్‌పేట్: దివంగత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న బిరుదును ప్రదానం చేయడం పట్ల పలు బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. నగరానికి చెందిన బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సినీ నటులు తనికెళ్ల భరణి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై పీవీ చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అంతకు ముందు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు గీతా మూర్తి, శ్రీరామకృష్ణ, అనురాధ ఆధ్వర్యంలో పీవీ ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా మార్కండేయ జయంతి

బౌద్ధనగర్: వారాసిగూడ పద్మశాలి సంఘం ఆవరణలో మార్కండేయ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ పద్మశాలి మార్కండేయ ట్రస్ట్ ఇన్‌చార్జి పూల మారుతి కుమార్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం సభ్యులు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బొమ్మ నరేంద్ర, అల్లి గోవింద్, జనార్దన్, సంతోష్, దీపిక, గీత, సుజాత, రూప పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి ఇంటింటి సర్వే

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అర్హులైన వారు తమ పత్రాల జిరాక్స్‌లు సమర్పించాలని లాలాగూడ ఎలక్ట్రికల్ ఏఈ రాజేష్ సూచించారు. మంగళవారం లాలాగూడ ఎలక్ట్రికల్ ఏఈ రాజేష్‌తో పాటు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరూ విద్యుత్ మీటర్ నంబర్, రేషన్, ఆధార్ కార్డుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరూ తమ కరెంట్ బిల్లు, ఆధార్, రేషన్ కార్డుల వివరాలు సమర్పించాలని సూచించారు. గాజుల హంసరాజు, వెంకటస్వామి, లక్ష్మణ్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆక్సిజన్ పార్క్‌లో చైన్ స్నాచింగ్

లాలాపేట: వాకింగ్ చేస్తున్న తల్లి, కూతురు మెడలో నుంచి మంగళసూత్రాలు లాక్కెళ్లిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అంబర్‌పేట డీడీ కాలనీకి చెందిన వి.స్వాతి (40), తన తల్లి వెంకటరమణమ్మ (65)తో కలిసి ఓయూ క్యాంపస్‌లోని ఆక్సిజన్ పార్క్‌కు సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. మంకీ క్యాప్ ధరించిన ఓ వ్యక్తి స్వాతి మెడలోని మంగళసూత్రాన్ని లాక్కెళ్తుండగా ఆమె ప్రతిఘటించడంతో సగం ఆమె వద్ద ఉండిపోయింది. వెనకాల వస్తున్న తన తల్లి మెడలో ఉన్న మంగళ సూత్రాన్ని లాక్కెళ్లగా అది కూడా కొంత తెగిపోయింది. ఇరువురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు గొలుసులు దాదాపు నాలుగు తులాలు ఉన్నట్లు తెలిపారు.

అండర్ పాస్‌లో అంధకారం



సికింద్రాబాద్ బోయిగూడ రైల్వే అండర్ పాస్‌లో అంధకారం నెలకొంది. నిత్యం జన సంచారంతో రద్దీగా ఉంటే ఇక్కడ అంధకారం అలుముకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. బోయిగూడ, బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, గొల్లకొమురయ్య కాలనీ, ఐడీహెచ్ కాలనీ తదితర బస్తీలకు చెందిన ప్రజలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. మొదట్లో ఇక్కడ అమర్చిన లైట్లు రానురాను వెలగడం మానేయడంతో అంధకారం నెలకొంది. రాత్రి వేళల్లో బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో ఆగతాయిలు, తాగుబోతులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతూ అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైల్వే అండర్ పాస్‌లో లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. –బన్సీలాల్‌పేట్

మహబూబ్ కళాశాల పుణ్యక్షేత్రమే

బోధమయానంద



చంద్రకాంత్ సాగర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: స్వామి వివేకానంద సందర్శించిన సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల పుణ్యక్షేత్రమేనని రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద అన్నారు. 1893 ఫిబ్రవరి 13న స్వామి వివేకానంద చికాగో పర్యటనకు వెళ్లే ముందు మహబూబ్ కళాశాలకు వచ్చి ఆంగ్లంలో ప్రసంగించి వెళ్లారని సెప్టెంబర్ 11న చికాగో వెళ్లి స్వామి వివేకానంద చేసిన ప్రసంగానికి ఇక్కడి ప్రసంగమే స్ఫూర్తిగా నిలిచిందన్నారు. అందుకే ఇలాంటి చరిత్రాత్మక ఘట్టానికి వేదికైన మహబూబ్ కళాశాల పుణ్యక్షేత్రంతో సమానమన్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత చంద్రకాంత్ సాగర్‌ను రామకృష్ణ మఠం స్వాములు సన్మానించారు. పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్నా స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తితో ఎదిగిన చంద్రకాంత్ సాగర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ కళాశాల కమిటీ అధ్యక్షులు పీఎల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: వసంత పంచమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు అష్టోత్తర శత కలశ అభిషేకం, అలంకారం, అర్చన, హారతి, ప్రసాదం పంపిణీ, అక్షరాభ్యాస కార్యక్రమాలు జరుగుతాయని 15న ఉదయం 7 గంటలకు సరస్వతి హోమం, చండీహోమం నిర్వహిస్తామన్నారు.

మంత్రివర్గంలో యాదవులకు స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న చక్రధర్‌యాదవ్, సదాశివయాదవ్

సనత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలో యాదవులకు స్థానం కల్పించకపోవడం బాధాకరమని అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్‌యాదవ్ అన్నారు. జెక్‌కాలనీ లక్ష్మీనివాస్‌లో మంగళవారం మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చక్రధర్‌యాదవ్ మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రాజకీయంగా యాదవుల ఉనికి దారుణంగా ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో గానీ, తెలంగాణ రాష్ట్రంలో గానీ ఏ ముఖ్యమంత్రి అధికారంలో ఉన్నా రాజకీయంగా యాదవులకు ఎంతో ప్రాధాన్యం దక్కిందన్నారు. మహానేత వైఎస్సార్, ఎన్టీఆర్‌ల హయాంలో తమ మంత్రి వర్గాల్లో ఇద్దరు యాదవులకు స్థానం కల్పించారని గుర్తు చేశారు. అలాగే కేసీఆర్ హయాంలో కూడా యాదవులకు ప్రాధాన్యం దక్కిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో యాదవులకు సరైన ప్రాధాన్యం లేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు యాదవులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని, అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో రెండు సీట్లు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో యాదవులకు అవకాశం కల్పించాలని అలా జరగని పక్షంలో యాదవులు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారన్నారు.

దేశవ్యాప్త బంద్‌కు పిలుపు

బౌద్ధనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో, క్యాబ్, లారీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమర్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్త బంద్ నేపథ్యంలో ఆ రోజు ఆటోలు నడుప వద్దని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా డ్రైవర్ల భవిష్యత్‌పై ప్రభావం చూపే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని, ఆటో మీటర్ రేట్లు పెంచాలని, ఆటో రవాణారంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎండీ. ఆరీఫ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

లాలాపేట: ఆటో, క్యాబ్, లారీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలనీ డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించనున్న రవాణా బంద్‌ను విజయవంతం చేయాలనీ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ ఉమర్ ఖాన్ పిలుపునిచ్చారు. డ్రైవర్ల భవిష్యత్‌పై ప్రభావం చూపే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేసి ఆటో రవాణా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు బోర్డు సమావేశం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం బుధవారం జరగనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పాల్గొననున్నారు. గత బోర్డు సమావేశంలో అసంపూర్తిగా చర్చకు వచ్చిన పలు అంశాలు, నూతన బోర్‌వెల్స్ తవ్వకం, హోర్డింగ్‌ల లీజు, అక్రమ నిర్మాణాలకు నోటీసుల జారీ తదితర అంశాలపై స్పష్టత ఇవ్వనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: ఐఐసీటీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.45 వరకు డెక్కన్ ఫీడర్ పరిధిలోని షిరిడీసాయి నగర్, బ్యాంక్ ఆఫ్ బరోడా, స్ట్రీట్ నంబర్–1, సూర్యవంశీ అపార్ట్‌మెంట్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా సాయి ఈశ్వర్‌గౌడ్



సికింద్రాబాద్: సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా సాయి ఈశ్వర్ గౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇది వరకు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన శ్రీను సిద్దిపేట 2టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో సాయి ఈశ్వర్‌గౌడ్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చారు.

'డిజిటల్ ఇండియా'ను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని మెక్లోడ్‌గూడలోని ప్రజాప్రయోజనార్థం చేపట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన డిజిటల్ ఇండియా సేవా శిబిరాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రజలు ఈ–సేవల కోసం ఎక్కడెక్కడో తిరగకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బ్యాంకు సేవలు, ఉచిత ఆరోగ్య శిబిరం, ఆధార్ కార్డు మార్పు చేర్పులు, వంట గ్యాస్ కనెక్షన్ సేవలు, పోస్టల్ సేవలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమకు అవసరమైన సేవలను ప్రజలు ఇక్కడికి వచ్చి వినియోగించుకోవాలన్నారు. చీర శ్రీకాంత్, ఆకుల ప్రతాప్, వులి మదన్ పాల్గొన్నారు.

ముగిసిన 'టీమ్ స్నూకర్' చాంపియన్ షిప్



సాక్షి, సిటీబ్యూరో: యువ స్నూకర్ ప్లేయర్స్‌ను ప్రోత్సహించేందుకు డెస్టినేషన్ పూల్ అకాడమీ నిర్వహించిన టీమ్ స్నూకర్ చాంపియన్ షిప్‌లో సుశీల్, అమన్ టీమ్ విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో వీరి జోడీ 3–0 ఫ్రేమ్స్‌తో బ్రాండన్, రవీష్‌పై విజయం సాధించింది. దివంగత హైదరాబాద్ ప్లేయర్ అరవింద్ పేరిట వారంరోజుల పాటు సాగిన ఈ టోర్నీలో 100కు పైగా జాతీయ, రాష్ట్ర స్థాయి స్నూకర్ క్రీడాకారులు పాల్గొన్నారు. 30 ఏళ్లుగా అంతర్జాతీయ ప్రమాణాలతో డెస్టినేషన్ పూల్ అకాడమీ నిర్వహిస్తున్నామని మేనేజింగ్ పార్టనర్స్ శ్రవణ్ కుమార్, సందీప్ రెడ్డి చెప్పారు. త్వరలో స్టేట్ ర్యాంకింగ్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. టీమ్ స్నూకర్ చాంపియన్ షిప్ విజేతలకు తెలంగాణ క్యూ స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అప్పారావు, 7హెచ్ స్పోర్ట్స్ ఫౌండర్ వెంకటేష్ నగదు బహుమతి, ట్రోఫీలు అందజేశారు. రాయల్ టచ్ ఓనర్ భరత్ చౌదరి, హైవిజన్ బిల్డర్స్ ఓనర్ సమీర్ పాల్గొన్నారు.

జర్నలిజం–మౌలికాంశాలపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న సీనియర్ పాత్రికేయులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జర్నలిజం–మౌలికాంశాలు అనే అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాప్‌రెడ్డి, జర్నలిజం పరిశోధకులు సుజాత హాజరయ్యారు. జర్నలిజంలో మౌలికాంశాలైన వార్త, వార్త నిర్మాణం, వార్తా కథనాలు, ఇంటర్వ్యూలు, అనువాదం అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అశోక్ బాబు, డాక్టర్ శ్రీనివాస్‌రావు, హరికిషన్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల అందజేత



కంటోన్మెంట్: విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని బీజేపీ నేత, పల్లవి విద్యా సంస్థల చైర్మన్ మల్క కొమురయ్య అన్నారు. పరీక్షల నేపథ్యంలో మారేడుపల్లిలోని మునిగే రామ్ మోహన్ రావు బాలికల జూనియర్ కళాశాల, పికెట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బాప్టిస్ట్ హై స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పికెట్, గాంధీయన్ హై స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు.

విద్యార్థులకు శుద్ధినీటిని అందించడమే లక్ష్యం



వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో సంస్థ సభ్యులు

రసూల్‌పురా: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన తాగునీటిని అందించేందుకు మినరల్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు డ్యూపాయింట్ సంస్థ ఇండియా డైరెక్టర్ ముకేష్ తారే పేర్కొన్నారు. సేఫ్ వాటర్ నేట్‌వర్క్ సంస్థ సహకారంతో మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో డ్యూపాయింట్ సంస్థ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు షర్రక్‌తో కలిసి ముకేష్ తారే మంగళవారం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో స్వచ్ఛమైన తాగునీరు లభించకపోవడంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో నీటిశుద్ధి యంత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ వైస్ ప్రసిడెంట్ పూనమ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలోని 54 పాఠశాలల్లో ఉచితంగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ లాల్, భద్ర, మల్లికార్జున్, శ్రీకాంత్, జితేందర్, రోహిత్, భాస్కర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల హక్కులు కాపాడాలి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న వెంకటేషన్

గాంధీఆస్పత్రి : పారిశుద్ధ్య కార్మికుల హక్కులు కాలరాస్తే ఎంతటి వారైనా క్షమించేది లేదని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం. వెంకటేశన్ హెచ్చరించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలను మంగళవారం సందర్శించిన ఆయన అక్కడ విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, పాలనాయంత్రాంగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికుల హక్కులు కాపాడాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజుకు ఎన్ని గంటల విధులు, సమయానికి వేతనాలు చెల్లిస్తున్నారా.. ఈఎస్ఐ, పీఎఫ్‌లను కార్మికుల ఖాతాలో జమ చేస్తున్నారా, బీమా సౌకర్యం తదితర వాటిపై ఆరా తీశారు. కార్మికులు, అధికారులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు, వేధింపులు ఇతర అంశాలపై ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించాలని, ఓ మహిళ ఉన్నతాధికారిని నియమించి, ఆమె పేరు, ఫోన్ నంబరు ఇతర వివరాలను నోటీస్ బోర్డులో పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, సూపరింటెండెంట్ రాజారావు, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కేడెట్లు

రసూల్‌పురా: జాతీయ మహిళా దినోత్సవం, సరోజిని నాయుడు జయంతి సందర్భంగా 1వ తెలంగాణ బాలికల ఎన్‌సీసీ బెటాలియన్ మహిళా సాధికారత, నారిశక్తి బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. లెఫ్టినెంట్ కల్నల్ ప్రదీప్‌కుమార్, మేజర్ చాముండి పర్యవేక్షణలో బెటాలియన్ యూనిట్ ప్రాంగణం నుంచి రాష్ట్రపతి నిలయం వరకు ఎన్‌సీసీ కేడెట్లు 5.5 కిలోమీటర్ల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయంలో పరిపాలనాధికారి రజనీ ప్రియా ఆధ్వర్యంలో లింగ సమానత్వం, సాధికారత సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో పాటు నుక్కడ్ నాటకం, సాంస్కృతిక ప్రదర్శనలు, నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, సాధిస్తున్న విజయాలు తదితర అంశాల్లో చర్చా కార్యక్రమాలు నిర్వహించారు.

అధికారుల బదిలీల్లో బీసీలపై వివక్ష తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ అధికారుల బదిలీలలో బీసీలపై వివక్ష తగదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బదిలీలలో బీసీలకు అంతగా ప్రాధాన్యం లేని పోస్టులకు పంపుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. అత్యంత ప్రాధాన్యం గల పోస్టులను ఒక వర్గానికి చెందిన అధికారులకు మాత్రమే కేటాయిస్తూ నీతి నిజాయితీ గల బడుగు బలహీన వర్గాలకు చెందిన అధికారులను ప్రాముఖ్యం లేని పోస్టులకు పంపుతున్నారని ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల పలుకుబడి పైరవీలతో కాకుండా ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు.

సౌకర్యాల కల్పనకు సంతకాల సేకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్టీఎస్ఏ) నాయకులు మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యారంగానికి సరిపడ నిధులు కేటాయింపు, మెస్ బకాయిల మాఫీ, ఉచిత భోజన వసతి కల్పన, ఫీజుల తగ్గింపు, ఫెలోషిప్‌లు అందచేయాలని కోరారు. తాళ్ల అజయ్, మనోజ్, ప్రసాద్, నవీన్, జమదగ్ని పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

అడ్డగుట్ట: యువతిని వేధింపులకు గురి చేసిన ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ (51) 2020లో మహేంద్రాహిల్స్‌లోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో చదువుకునే ఓ విద్యార్థిని(17)తో అసభ్యకరంగా మాట్లాడుతూ మానసిక వేధింపులకు గురి చేశాడు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. మంగళవారం నాంపల్లిలోని మెట్రోపాలిటన్ కోర్టులో నిందితుడికి హాజరు పరుచగా 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 12 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

గురుకులాలను ఒకే గొడుగు కిందకు చేర్చాలి



వీసీని సన్మానిస్తున్న ప్రొ.శంకర్

ఉస్మానియా యూనివర్సిటీ: కులానికొక గురుకులం పాఠశాల కాకుండా కులమతాలకతీతంగా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ అన్నారు. మంగళవారం క్యాంపస్‌లోని బీఈడీ కాలేజీ ఆడిటోరియంలో ది ఎస్‌ఈసీ–2020 అలైన్మెంట్ ద్వారా తెలంగాణ పాఠశాల బాలికల సాధికారతపై కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ప్రభావం అనే అంశం పై వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్ ప్రొ.శంకర్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, రమేష్ చంద్ర, ప్రొ.సుధాకర్ రెడ్డి, ప్రొ.శ్రీనివాస్, ప్రొ.రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహం.. వార్షికోత్సవం



సర్టిఫికెట్ అందజేస్తున్న ఉమా సుధీర్

సనత్‌నగర్: బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముందుగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా జోసెఫ్ వార్షిక నివేదికను సమర్పించారు. తమ విజయాల వెనుక ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి ఎంతగానో ఉందని అభినందించారు. దేశంలోని ఎన్ఐఆర్ఎఫ్ టాప్–100 కళాశాలల్లో 98వ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన లీడర్‌షిప్ కోచ్, ఆర్గనైజేషనల్ ట్రాన్స్‌ఫర్మేషన్ గురు ఆనంద్ పిళ్లై మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం నేర్చుకోవడం అలవర్చుకోవాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఎన్డీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమాసుధీర్ మాట్లాడుతూ.. 2047 విజన్‌తో ప్రధానమంత్రి ముందుకు సాగుతున్నారని, ఈ 25 ఏళ్లల్లో అపూర్వమైన అభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ప్రావిన్స్ సిస్టర్స్ ఆఫ్ చారిటీ అల్ఫోన్సా వటోలీ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శన